నేడు 'డయల్ యువర్ డీఎం'

కాచిగూడ: ప్రయాణికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆర్టీసీ 'డయల్ యువర్ డీఎం'కార్యక్రమాన్ని ఈనెల 20న నిర్వహిస్తున్నట్లు కాచిగూడ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రయాణికులు ఫోన్ నం.99592 26130లో ఫిర్యాదు చేయాలని కోరారు.

బర్కత్‌పుర డిపోలో...

ఆర్టీసీ డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఈనెల 20న మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ బర్కత్‌పుర డిపో మేనేజర్ ఆర్.మంజులా రెడ్డి తెలిపారు. ప్రయాణికులు ఫోన్ నం.90004 06069లో తమ సమస్యలు తెలపాలని ఆమె సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. గోల్కొండ క్రాస్‌రోడ్, స్పెన్సర్స్ ఫీడర్ల పరిధిలోని ఏక్ మినార్ మజీద్, కృష్ణాకాలనీ, శివాలయం టెంపుల్, ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్, రాజాడీలక్స్ రేస్‌కోర్స్, ఎన్‌టీకే ఎస్టేట్, చర్చిగల్లీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు.. దయారా మార్కెట్ ఫీడర్ పరిధిలోని జమిస్తాన్‌పూర్, రిసాల, సాగర్‌లాల్ హాస్పిటల్, హరినగర్, తాడి కంపౌండ్ తదితర ప్రాంతాల మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

చదువులు పూర్తయినా అందని సర్టిఫికెట్లు

ఉస్మానియా యూనివర్సిటీ: చదవులు పూర్తి చేసినా సర్టిఫికెట్లు అందుకోలేని దుస్థితి రాష్ట్రంలో నెలకొని ఉందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రావలసిన రూ.8000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయనందున కాలేజీల యజమానులు సర్టిఫికెట్లు జారీ చేయడం లేదన్నారు. సర్టిఫికెట్లు లేనందున విద్యార్థులుపై చదవులకు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టోకెన్లు ఇచ్చి విద్యార్థుల స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలని కోరారు.

బుద్ధుడి బోధనలు అనుసరణీయం

గన్‌ఫౌండ్రీ: బుద్ధుడి బోధనలు అనుసరణీయమని విశ్రాంత డీజీపీ సి.ఆంజనేయరెడ్డి అన్నారు. గురువారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో లతారాజ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ ఎడ్లూరి తెలుగులోకి అనువాదించిన బోధిసత్వ అంబేడ్కర్ బుద్ధ ధర్మ మిషన్ పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బుద్ధుని బోధనలు నాడు ప్రపంచంలో పలు దేశాలపై ప్రభావం చూపాయని గుర్తుచేశారు. మహారాష్ట్ర రిటైర్డ్ ఐఏఎస్ శ్యామ్ తగాడే, మోక్షానంద బుద్ధ విహార ప్రతినిధి బిక్కు ధర్మ రక్షిత, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు పరందాములు, పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి టి.సురేష్, లతారాజ ఫౌండేషన్ ట్రస్టీ కెకె.రాజ పాల్గొన్నారు.

జాతీయ యోగారత్న అవార్డుకు రామకృష్ణ శాస్త్రి ఎంపిక

చార్మినార్: రాజన్న బావి ప్రాంతానికి చెందిన ప్రముఖ యోగా గురువు సంఘన బోయిన రామకృష్ణ శాస్త్రిని ఈ ఏడాది జాతీయ యోగా రత్న పురస్కార్–2025కు ఎంపిక చేసినట్టు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ తెలిపారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రం నుంచి ఒక్కరికి ఇచ్చే ఈ అవార్డు ప్రదానం కోసం ఆయనను ఎంపిక చేశామని తెలిపారు. రామకృష్ణ శాస్త్రి 8 ఏళ్ల వయస్సు నుంచి ఢిల్లీలో యోగాసనాలు ప్రారంభించి ఐఏఎస్,ఐపీఎస్, ఎంపీ, ఎమ్మెల్యే, మినిస్టర్లకు, న్యాయవాదులకు, చలన చిత్ర కళాకారులకు, నటులకు న్యాయమూర్తులకు, కళాశాల, పాఠశాలలో 30 ఏళ్లుగా నిర్విరామంగా యోగాభ్యాసం చేయిస్తూ అందరికీ యోగా ద్వారా కలిగే ప్రయోజనాలు తెలియజేస్తున్నారన్నారు.

ఎమ్మెల్యే రాజాసింగ్ క్షమాపణ చెప్పాలి

అబిడ్స్: బోనాల సంప్రదాయాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే రాజాసింగ్ వెంటనే క్షమాపణ చెప్పాలని నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. బోనాల ఉత్సవాలకు ఎమ్మెల్యే రాజాసింగ్‌ను ఆహ్వానించొద్దని ఆయన నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. గురువారం తన కార్యాలయంలో మాట్లాడుతూ.. బోనాల సందర్భంగా డీజేలు, బ్యాండ్ మేళాలు పెట్టొద్దని, నృత్యాలు చేయొద్దని ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు బోనాల సంప్రదాయాన్ని దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. బోనాల పండుగకు కల్లు, లేదా మద్యం సాకపెట్టడం తరతరాలుగా వస్తున్న ఆచారమని ఆయన పేర్కొన్నారు.

వన మహోత్సవానికి సన్నద్ధం.!

- మలక్‌పేట సర్కిల్–6 అధికారుల కసరత్తు
- ప్రజా పంపిణీకి 30 వేల మొక్కలు
- ప్రభుత్వ స్థలాల్లో నాటేవి 2 వేలు



నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

చాదర్‌ఘాట్: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో మలక్‌పేట సర్కిల్–6 అధికారులు వన మహోత్సవానికి సన్నద్ధమవుతున్నారు. మలక్‌పేట సర్కిల్–6 పరిధిలోని ఆరు డివిజన్లలో 30 వేల మొక్కలు నాటేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందు కోసం పార్కులు, కాలనీలు, ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలు, ఆవరణ స్థలాలను ఎంపిక చేశారు. డివిజన్ల వారీగా నిర్వహించనున్న నేపథ్యంలో ఆయా ప్రాంత ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, కాలనీ సంక్షేమ సంఘాల సహకారం తీసుకునేందుకు కసరత్తు చేస్తున్నారు.

2 నర్సరీల్లో పెంపకం..

మలక్‌పేట జీహెచ్ఎంసీ సర్కిల్–6 పరిధిలో 2 డివిజన్లలో నర్సరీలు ఏర్పాటు చేశారు. కొన్ని రకాల మొక్కలకు ఇక్కడే అంట్లు గట్టి పెంచడంతో పాటు కొన్నిరకాల మొక్కలకు ఇతర నర్సరీల నుంచి దిగుమతి చేసుకుని ఇక్కడ సంరక్షిస్తున్నారు. ఇంటి ముందు ఆవరణలో ప్రజలు మొక్కలు నాటుకునేందుకు నిమ్మ, దానిమ్మ, కరివేపాకు, జామ, అల్ల నేరేడు మొక్కలు పంపిణీ చేయనున్నారు. ఇతర చోట్ల వేప, రావి, చింత, కానుగ, బాదం మొక్కలు నాటనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కార్యక్రమాల టైం టేబుల్ ఖరారు కాగానే మొక్కల పంపిణీ ప్రారంభిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ స్థలాలపై ప్రత్యేక దృష్టి..

సర్కిల్ పరిధిలో విశాలమైన మైదానాలు, పార్కులు లేవనే చెప్పాలి. దీంతో అధికారులు ప్రభుత్వ స్థలాలపై దృష్టి సారిస్తున్నారు. స్థానికంగా ఉన్న పార్కులు, శ్మశానవాటికలు, విశాలమైన రహదారులకిరువైపులా ప్రభుత్వ స్థలాల్లోనూ పెద్ద సంఖ్యలో మొక్కలు నాటనున్నారు.

పంపిణీ తీరు..

సర్కిల్–6 పరిధిలో 6 డివిజన్లలో అన్నిరకాల మొక్కలు కలిపి 30 వేల మొక్కలు నాటనున్నారు. డివిజన్‌కు 5 వేల చొప్పున మొక్కలు పంపిణీ చేయనున్నారు. ఇందులో 2 వేలు చిన్నతరహా 3 వేలు ఏపుగా పెరిగే మొక్కలు అందించనున్నారు. ఆరు డివిజన్లు కలిపి 30 వేల మొక్కలు నాటుతారు.

సంరక్షణకూ చర్యలు



మొక్కలు పెరిగేందుకు అనువైన స్థలాలు, సరిపోయే గుంతలను ఏర్పాటు చేస్తున్నాం. మొక్కలు నాటిన తర్వాత వాటి సంరక్షణకూ చుట్టూ కంచెలు ఏర్పాటు చేస్తాం. వనమహోత్సవాన్ని ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించి మొక్కలు నాటి పెంచాలి.

– సర్కిల్–6 హార్టికల్చర్ అధికారి కిరణ్‌కుమార్

ట్రిపుల్ ఐటీ కార్మికులకు పెరిగిన జీతాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న బీఎంఎస్ నేత కేవీ రాధాకృష్ణ

చిక్కడపల్లి: బాసర ట్రిపుల్ ఐటీలో పనిచేస్తున్న కార్మికులకు పెరిగిన జీతాలను వెంటనే విడుదల చేయాలని బీఎంఎస్ ఆలిండియా వర్కింగ్ కమిటీ సభ్యులు కేవీ రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు నెలలకు ఒకసారి పెరిగే 8 డీఏలు పెండిగ్‌లో ఉన్నాయని తెలిపారు. పెరిగిన డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సమస్యలను పరిష్కరించి పేస్లిప్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర కార్మికశాఖ ఉపకమిషనర్ నీలమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు వెంకటేశం, శంకర్, రంగారావు, అజయ్, రాములు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యను అమలు చేయాలి

కాచిగూడ: తెలంగాణలో విద్యా వ్యాపారాన్ని అరికట్టి ఉచిత విద్యను అమలు చేయాలని జాతీయ మహిళా జేఏసీ చైర్‌పర్సన్ మట్ట జయంతిగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు ఫీజులను తమ ఇష్టానుసారంగా పెంచుతూ ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నాయని ఆమె ఆరోపించారు. విద్యా వ్యవస్థను వ్యాపారంగా మార్చేసి రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తుండటం తల్లిదండ్రులకు భారంగా మారిందని ఆమె ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత విద్యను కూడా అమలు చేసి ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణను నిలపాలని కోరారు. మార్కులు తక్కువగా వచ్చాయని చెప్పి డొనేషన్ల రూపంలో లక్షల్లో వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై ప్రభుత్వ కఠిన చర్యలు తీసుకుని వాటి లైసెన్స్‌లను రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. పిల్లల భవిష్యత్ కోసం అప్పులు చేస్తూ చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యల పాలవుతున్న కుటుంబాలను న్యాయం జరిగే విధంగా చూడాలని ఆమె కోరారు.

కవాడిగూడ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా బొల్ల రమేష్



కవాడిగూడ: కవాడిగూడ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా బొల్ల రమేష్‌ను నియమించినట్లు డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. అభివృద్ధిని వివరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నానని అన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, బీజేపీ కార్యవర్గానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

అమెరికా వర్సిటీతో ఓయూ ఒప్పందం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ బీఈడీ కాలేజీ అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ నోటెర్ డామ్‌తో పరస్పర అవగాహన ఒపందాలు కుదర్చుకున్నాయి. ఈ రెండు వర్సిటీలు గ్లోబల్ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ ది హోల్ చైల్డ్ సంస్థ ఇక నుంచి పనిచేయనున్నట్లు చెప్పారు. విద్యార్థులు, అధ్యాపకులు పరస్పర మార్పిడితో పాటు ఉమ్మడి పరిశోధనలకు ఉపయోగపడుతుందని వీసీ పేర్కొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ పాలన



కాచిగూడలో జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఉమారాణి

కాచిగూడ: ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో దేశం గణనీయమైన అభివృద్ధి సాధిస్తోందని కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి అన్నారు. ప్రధానిగా నరేంద్రమోదీ 11 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం కాచిగూడలోని ఇందిరానగర్ శక్తి కేంద్రాలు, పోలింగ్ బూత్ నం. 200, 201, 202, 203లతో వికసిత్ భారత్ రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ ప్రభుత్వం కృషి చేస్తుందని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు బల్వీర్, మల్లికార్జున్, శంకర్, రాము, ప్రశాంత్, బి.భీమ్‌రాజ్, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓవైపు అక్రమ పార్కింగ్.. మరోవైపు గుంతలరోడ్డు!





చిక్కడపల్లి పాత పోలీస్‌సేషన్ బీఎస్ఎన్ఎల్ గల్లీలో గుంతల్లో మురుగు, అక్రమ పార్కింగ్

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని చిక్కడపల్లి పాత పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న బీఎస్ఎన్ఎల్ గల్లీలో అక్రమ వాహనాల పార్కింగ్ ఇబ్బందికరంగా మారింది. దీంతో జవహర్‌నగర్, అశోక్‌నగర్‌కు వెళ్లే వాహనాదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు వాహనాల చాటున మూత్ర విసర్జన చేయడంతో గల్లీ దుర్గంధంగా మారింది. దీనికి తోడు ఈ ప్రాంతంలో నిత్యం పైప్‌లైన్ లీకేజీలతో రోడ్లు గుంతలమయంగా మారుతోంది. దీంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖల అధికారులు స్పందించి అక్రమ పార్కింగ్‌కు అడ్డుకట్ట వేసి.. గుంతలకు ప్యాచ్‌వర్క్ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



బ్యూటీషియన్ శిక్షణ శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: మహిళలు ఉచిత స్వయం ఉపాధి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా రాణించాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ సూచించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్, నివి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వీవీ గిరినగర్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహిస్తున్న ఉచిత బ్యూటీషియన్ శిక్షణ శిబిరాన్ని ఆమె గురువారం సందర్శించి మాట్లాడారు. కోర్సు పూర్తి చేసుకున్న వారికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, శిక్షకురాలు ప్రవీణ పాల్గొన్నారు.

కలుషిత నీటి సరఫరా సమస్యను పరిష్కరించాలి



జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్‌లోని చాకలిబస్తీ, భోలక్‌పూర్ హౌస్ ప్రాంతాలలో నెలకొన్న కలుషిత నీటి సరఫరా, లోప్రెషర్ నీటి సమస్యను పరిష్కరించాలని బీజేపీ నాయకులు గురువారం జలమడలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో దిశా కమిటీ సభ్యుడు నందగిరి నర్సింహ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యావర్గ సభ్యులు బిజ్జి కనకేష్‌కుమార్ తదితరులు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి సమస్యలను వివరించారు. భోలక్‌పూర్ హౌస్ ప్రాంతంలో లోప్రెషర్ నీటి సరఫరా వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఫిర్యాదు చేశారు. నూతనంగా పవర్‌బోర్ ఏర్పాటు చేయాలన్నారు. చాకలిబస్తీ, బస్తీ దవాఖానా వీధిలో నిత్యం కలుషిత నీటి సరఫరా జరుగుతుందని ప్రజలు అనారోగ్యం పాలు అవుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో వెంటనే కొత్త పైపులైన్‌లను వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్‌కుమార్, వీరేష్, నాగేందర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంపై సరళీకరణ విధానాల ప్రభావం



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సెమినార్‌లో పాల్గొన్న విజ్జు కృష్ణన్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మన దేశంలో వ్యవసాయాన్ని నాలుగు కార్పొరేట్ కంపెనీలు కబలిస్తున్నాయని ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనాలు, పురుగుల మందులు ఆ కంపెనీల గుప్తాధిపత్యంలో నడుస్తున్నాయని ఆరోపించారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అరబండి ఫౌండేషన్ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా విజ్జు కృష్ణన్ మాట్లాడుతూ.. రైతు భరోసా, రైతు బీమా కూడా రైతుల మరణాలను ఆపలేకపోతున్నాయని అన్నారు. అన్నదాతపై కరెంట్ మీటర్ల భారం మోపేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నద్ధమవుతుందని పేర్కొన్నారు. సరళీకరణ విధానాల ప్రభావం వ్యవసాయ రంగంపై పడిందన్నారు. సరళీకరణ విధానాలతో రైతులకు మేలు జరుగుతుందని నాటి పాలకులు నమ్మబలికారని తరువాత దేశంలో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని.. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వీసీ రాజిరెడ్డి, అరబండి వేణు ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, టి.సాగర్, పోతునేని సుదర్శన్‌రావు, మూడ్ శోభన్‌నాయక్, ప్రసాద్‌రావు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మయూరానందం.!



వివేక్‌నగర్‌లోని పీపుల్స్ పార్క్ సమీపంలో టెర్రస్‌పై మయూరం కనువిందు చేసింది. టెర్రస్‌పై పార్కులాగా పచ్చని మొక్కలు కూరాగాయలు, పండ్ల మొక్కలు ఉండటంతో అక్కడ నెమలి సందడి చేసింది. ఈ దృశ్యాన్ని చూసిన ఇంటి యాజమాని నండూరి శ్రీనివాసరావు తన ఫోన్‌లో ఫొటోలు, వీడియోలు తీసి బంధించారు. – చిక్కడపల్లి

మోదీ సర్కారు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మహంకాళి జిల్లా అధ్యక్షులు భరత్‌గౌడ్‌కు ఇన్‌చార్జిల లిస్టును అందజేస్తున్న శంకర్, శేషసాయి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రధానిమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు గుండగొని భరత్‌గౌడ్ అన్నారు. గురువారం చిక్కడపల్లిలో సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ బూత్ శక్తి కేంద్రాల ఇన్‌చార్జిల లిస్ట్, నివేదికను భరత్‌గౌడ్‌కు మహంకాళి జిల్లా శక్తి కేంద్రాల కన్వీనర్ టోపి శంకర్ అందజేశారు. అనంతరం భరత్‌గౌడ్ మాట్లాడుతూ... దేశంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని అన్నారు. బూత్‌స్థాయి నుంచి పార్టీ పటిష్టత కోసం అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో–కన్వీనరు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రోయ్యూరు శేషసాయి, నాయకులు ప్రకాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పఠనాసక్తి.!



హైమవతి పాఠశాలలో నేషనల్ రీడింగ్ డే

పఠనాసక్తితో విద్యార్థులు అబ్బురపరిచారు. నేషనల్ రీడింగ్ డేను పురస్కరించుకుని గురువారం అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌లోని హైమవతి పాఠశాలలో జాతీయ రిడింగ్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్ భాషాల్లో తమ పఠన సామర్థ్యాన్ని ప్రదర్శించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ హైమవతి, ప్రిన్సిపల్ సబితారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. - అంబర్‌పేట

ఉన్నతంగా నిలిపేది సేవాభావమే..

మనిషిని ఉన్నతంగా నిలిపేది సేవాభావమేనని సీనియర్ పాత్రికేయులు బైస దేవదాసు అన్నారు. పలు సామాజిక కార్యక్రమాలు చేస్తూ ప్రతి ఏటా భార్య పేరిట 'ఏకా పద్మ స్మారక పురస్కారం'రామ్మోహన్‌రావు అందించడం హర్షణీయమని అన్నారు. శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం త్యాగరాయ గానసభలో పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ప్రముఖ వైద్య నిపుణుడు డా. ముదావత్ కిషన్ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బైస దేవదాసు మాట్లాడుతూ.. వైద్యరంగంలో మరింత శిఖరాలకు కిషన్ ఎదగాలని ఆకాంక్షించారు. పురస్కారాలు ప్రోత్సాహం ఇస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అవంతి కళాశాల ప్రతినిధి డా. వెంకట్రావు, సాహితీ కిరణం మేనేజర్ పొత్తూరి విజయ లక్ష్మి, నిర్వాహకులు సుబ్రహ్మణ్యం, భాను వందన పాల్గొన్నారు. - చిక్కడపల్లి



ఓనమాలు దిద్దించి.!



అంగన్‌వాడీ కేంద్రాఆలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ సూచించారు. భరత్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఆమె చిన్నారులకు పలకలు అందజేసి ఓనమాలు దిద్దించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులకు ప్రతిరోజు పాలు, గుడ్లు, వివిధ రకాల ఆహారం అందిస్తారని పేర్కొన్నారు. ఇక్కడ మంచి విద్యతో పాటు పౌష్టికాహారం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.నవీన్‌గౌడ్, కంచి ముదిరాజ్, సత్యనారాయణ, వెంకటేష్, అంగన్‌వాడీ టీచర్ శారదా తదితరులు పాల్గొన్నారు. - ముషీరాబాద్